# మనిషిని మనిషిగా స్వీకరించే సోషలిజం : ఎరిక్ ఫ్రామ్

– కె. బాలగోపాల్

'సామాజిక అస్తిత్వం సామాజిక చైతన్యానికి పునాది' అన్నది మార్క్సిజంలోని ప్రధాన సూత్రాలలో ఒకటి. మార్క్స్‌కు ముందు ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేదనడం అవాస్తవమవుతుంది. ఆ విధంగా మార్క్స్‌కూడా ఎప్పుడూ అనలేదు. నిజానికి ఈ సుత్రంలోని 'పునాది' అనే మాటను అది సూచించే సంబంధాన్ని ఏవిధంగా అర్థం చేసుకుంటామనే విషయంలో తేడాలుంటాయిగానీ, సామాజిక జీవితాన్ని గురించి మనుషులు చేసే ఆలోచనలను శాస్త్రీయంగా విశ్లేషించే వారెవరైనా సామాజిక అస్తిత్వం మీద మొదట దృష్టి పెట్టక తప్పదు.

అయినప్పటికీ సంప్రదాయక (భావవాద) సామాజిక తత్వశాస్త్రం మీద ఈ (భౌతిక వాద) సూత్రాన్ని ఆయుధంగా సంధించి ఒక సమగ్రమైన చారిత్రక సిద్ధాంతాన్ని ఆ ప్రాతిపదిక మీద నిర్మించిన ఘనత మార్క్స్‌కే దక్కుతుంది. ఆలోచనలకు జీవితం పునాది అనే ఈ భౌతిక వాద సూత్రం (అందులో ఎన్ని తాత్విక సమస్యలున్నప్పటికీ) ఈ రోజు ఎంతగా మన 'కామన్ సెన్స్'లో భాగమయి పోయిందంటే 'అదేం పెద్ద గొప్ప సిద్ధాంతమా?' అని ఎవ్వరైనా ఆశ్చర్యంగా అడగొచ్చు. అయితే అది మనుషుల సామాన్య ఆలోచనారీతిలో భాగంకావడం మార్క్సిజం సాధించిన విజయమేనని చెప్పక తప్పదు. సామాన్య మానవ ఆలోచనారీతిలో భాగమయి పోవడమే ఒక ఆలోచన సాధించగల అతిగొప్ప విజయమనుకుంటే మార్క్సిస్టు భౌతిక వాదం ఆ విజయాన్ని సాధించినట్టే.

అంత మాత్రం చేత అందులోని తాత్విక సమస్యలు పరిష్కారమయిపోయినట్టు కాదు. సామాన్య మానవ ఆలోచనా రీతులలో తాత్వికంగా సమస్యాత్మకమైనవి అనేకం ఉంటాయి కాబట్టి ఇక్కడ వైరుధ్య మేం లేదు.

మనుషుల చైతన్యాన్ని వారి భౌతిక అస్తిత్వం నిర్ణయిస్తుందని ఎందుకు భావించాలి? నిర్ణయించే ఆ క్రమం ఏమిటి? ఆ అభిప్రాయానికి రుజువేమిటి? ప్రపంచంలో మనకు కనిపించే విభిన్నమయిన మానవ ఆలోచనా రీతులను అర్థం చేసుకోవడానికది సరిపోతుందా? పూర్తిగా వ్యక్తిగతమైన ఆలోచనా రీతులను ఒక పక్కన పెట్టినా! సామాజిక ఆలోచనా స్రవంతులను అర్థం చేసుకోవడానికి సరిపోతుందా? నాజీ వాదాన్నీ, గాంధీ వాదాన్నీ, మత అసహనాన్నీ, సూఫీ వాదాన్నీ, మదర్ థెరెసాను, అణుయుద్ధ దాహాన్నీ, అన్నిటినీ అర్థం చేసుకోవడానికి సరిపోతుందా?

ఈ ప్రశ్నలు వేసుకోవడానికి సాహసించిన మార్క్సిస్టులలో ఎరిక్‌ఫ్రామ్ ఒకరు. బహుశా ఒక్కరేనని కూడా అనవచ్చునేమో. తనకూ తన తరం యూరోపియన్లకూ బాగా పరిచయం ఉన్న నాజీ వాదాన్నీ, యుద్ధోన్మాదాన్నీ, పెట్టుబడిదారీ సరుకుల దాహాన్నీ ఉదాహరణలుగా తీసుకొని అతను ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే ప్రయత్నం చేసాడు. విజయం సాధించాడని అనలేముగానీ చాలా విలువయిన విశ్లేషణ చేసాడు.

ఎరిక్ ఫ్రామ్ గొప్ప ఆశావాది. అతనిది తెచ్చిపెట్టుకున్న ఆశావాదం కాదు, స్వచ్ఛమైన ఆశావాదం. అది అవాస్తవికమయినా దానిని గౌరవించవచ్చును. మార్క్స్ ఆలోచనల తాత్విక మూలాలలోనే మానవ అస్తిత్వాన్ని గురించి, నైజాన్ని గురించి బలమైన ఆశావాదం ఉంది. అయితే

కె. బాలగోపాల్, హైదరాబాదు, పౌరహక్కుల ఉద్యమ నాయకుడు, ప్రముఖ న్యాయవాది.

మార్క్సిస్టులందరూ స్వచ్ఛమైన ఆశావాదులు కాదు. 'బడితె చేతిలో ఉంటే ఈ ప్రపంచం బాగుపడక చస్తుందా' అనుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. మార్క్సిస్టులు అధికారానికి దగ్గరయ్యే కొద్దీ వీరి సంఖ్యే మెజారిటీ అవుతూ ఉంటుంది. దీనికి కారణం కూడా మార్క్స్ సిద్ధాంతంలోనే ఉంది గానీ ఆ విశ్లేషణలోకి పోవడానికిది సందర్భం కాదు.

మనుషుల చైతన్యం మెదడుకు సంబంధించినది ( ఆలోచనలు తలలో ఉంటాయి) అనుకున్నంత కాలం, చైతన్యాన్ని అస్తిత్వం నిర్ణయిస్తుందన్న సూత్రాన్ని 'రుజువు' చేయడం సులభమే. అయితే దాని వల్ల మనకు అర్థం అయ్యేదీ స్వల్పమే. ఒక చెట్టు ఏ విధంగా ఉంటుందో ఆ చెట్టుకు సంబంధించి మన ఆలోచనలలో ఉండే చిత్రం కూడ అదే విధంగా ఉంటుంది కదా. కాబట్టి మన జీవిత నైజం ఎట్టిదో దానిని గురించి మనకుండే చైతన్యమూ అట్టిదే.

దీనిని 'ప్రతిఫలన సిద్ధాంతం' అంటారు. దీనిని మనుషులకు చెట్ల స్వరూపాన్ని గురించి ఉండే జ్ఞానానికే కాక, సామాజిక చైతన్యానికి కూడ అన్వయించడంలో ఉండే ఇబ్బందిని భౌతిక వాదులు తొలినాడే గమనించారు. మనుషులలో చాలా మందికి తమ జీవిత ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఆలోచనలుంటాయి. కాబట్టి చైతన్యం అస్తిత్వాన్ని ఉన్నదున్నట్టు ప్రతిబింబిస్తుందని నమ్మకూడదని భౌతికవాద తత్వవేత్తలు అనసాగారు. సామాజిక అస్తిత్వమే తన అసలు నైజాన్ని కప్పిపెట్టి తలకిందులుగా కనిపిస్తుందని ( ఇది ప్రత్యేకించి పెట్టుబడిదారీ 'సరుకుల మాయ' కు ఉండే లక్షణమని), పాలక వర్గాలకు ఆలోచనల సాధికారతపైన ఉండే ఆధిపత్యం వల్ల వారి ప్రయోజనాలే పాలిత వర్గాల ప్రయోజనాలుగా వారు ప్రచారం చేయగలుగుతారని, ఇత్యాది కారణాలవల్ల సామాజిక చైతన్యం సామాజిక అస్తిత్వాన్ని ఉన్నదున్నట్టు ప్రతిబింబించదని అనసాగారు.

ఈ సవరణతో స్వీకరించినా చరిత్రలో కనిపించే అన్ని రకాల చైతన్య రీతులనూ - పైన చెప్పినట్టు నాజీ వాదం నుండి మదర్ థెరిసా దాకా - ఈ సిద్ధాంతం వివరించగలదని నమ్మటం కష్టం. కానీ ఇంతకంటే మెరుగయిన వివరణ ప్రతఫలన సిద్ధాంతంలో లేదు. దానిని సవరించే హెచ్చరికలలోనూ లేదు.

కానీ మనస్తత్వ శాస్త్రం - ముఖ్యంగా సైకో ఎనాలిసిస్ - అభివృద్ధి చెందిన క్రమంలో చైతన్యం మెదడుకు సంబంధించిన విషయం కాదనీ, వ్యక్తిత్వానికి సంబంధించిన విషయమని అర్థమయింది. అప్పుడు చైతన్యాన్ని వివరించడానికి చెట్టు సామ్యం ఎందుకూ కొరగాదు. ఇంకా సరిగ్గా చెప్పాలంటే చైతన్యానికి సంబంధించిన భౌతిక ప్రక్రియ 'ఆలోచించడం' అనే క్రియ - మెదడులోనే జరిగినప్పటికీ చైతన్యానికి సంబంధించిన వస్తువు లేక విషయం మెదడుకు కాక వ్యక్తిత్వానికి చెందినది. చెట్టునో, కుర్చీనో మనం చూడడం అనేది మన వ్యక్తిత్వంతో నిమిత్తం లేని భౌతిక క్రియ కాబట్టి చెట్టు లేక కుర్చీ అనే ఊహ లేక భావన భౌతిక వాస్తవికతకు ప్రతిఫలనం అనడం ఒకెత్తు. సామాజిక చైతన్యాన్ని వివరించడానికి ఇది కనీసం ఒక పోలికగా కూడ పనికి రాదు.

మరి మనిషి వ్యక్తిత్వం ఏవిధంగా రూపం తీసుకుంటుంది? దానిని భౌతిక జీవితమే నిర్ణయిస్తుందని రుజువు చేయగలమా? చేయగలిగినట్టయితేనే మానవ చైతన్యాన్ని మానవ భౌతిక అస్తిత్వం నిర్ణయిస్తుందని చెప్పగలం. ఈ ప్రయత్నం చేయనంత కాలం మార్క్సిజం - ప్రత్యేకించి, చారిత్రక భౌతిక వాదం - అసంపూర్ణంగానే ఉంటుంది.

ఆ ప్రయత్నమే సైకో ఎనాలిసిస్ ప్రాతిపదికగా ఎరిక్ ఫ్రామ్ చేసాడు. కానీ ఫ్రాయిడ్‌ను మౌలికంగానే సవరించి వేసాడు. మానవ లైంగికత (ఫ్రాయిడ్ ఈ మాటను మామూలుగా వాడే అర్థం కంటె విశాలమైన అర్థంలో వాడతాడు) బాల్యంలో వ్యక్తమయ్యే రూపాలకూ కుటుంబ పెద్దల ద్వారా అమలయ్యే సామాజిక నియమాలకూ మధ్యనుండే వైరుధ్యాన్నీ దాని పర్యవసానాలను ప్రాతిపదిక చేసుకొని ఫ్రాయిడ్ మనిషి వ్యక్తిత్వం రూపొందే క్రమాన్ని వివరిస్తాడు.

ఎరిక్ ఫ్రామ్ ఫ్రాయిడ్ విశ్లేషణలను అనేక సందర్భాలలో వాడుకుంటాడు గానీ, వ్యక్తిత్వ విశ్లేషణకు వేరే ప్రాతిపదిక ప్రతిపాదిస్తాడు. మానవ నైజాన్ని నిర్వచించి దానిని పునాది చేసుకొని తన విశ్లేషణను రూపొందిస్తాడు. మానవ నైజాన్ని నిర్వచించడ మంటే మనుషులు ప్రాథమికంగా మంచి వారని గానీ, ప్రాథమికంగా చెడ్డవారని గానీ ప్రకటించడం కాదు. మానవ అస్తిత్వ నైజాన్ని (ఆంటాలజీ - ontology) వివరించడం.

మార్క్స్‌కు ముందు తత్వవేత్తలందరూ మానవ నైజాన్ని సూత్రీకరించారని, మార్క్స్ ఆ పని చేయలేదని ప్రతీతి. మార్క్సిస్టులలో ఇతరత్రా విభేదాలున్నా వారుకూడ (గ్రాంసి, లెనిన్, అల్తూజర్‌లను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు) ఈ మాటే అంటారు. అనడమే కాక దానిని మార్క్స్ విశిష్టతగా భావిస్తారుకూడ. మార్క్స్ అటువంటి సూత్రీకరణ చేయక పోవడానికి ఒక కారణం ఉంది. ఆయన దృష్టిలో ఇప్పటివరకు మనిషి నిండయిన మనిషే కాదు. మనిషి తన సృజన శక్తిని అపరిమితంగా అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన భౌతిక ఉత్పాదన శక్తిని సాధించుకున్న తరువాతే అసలయిన మనిషి ఉద్భవించడం జరుగుతుంది. మనిషి 'ఒకరితో అందరూ అందరిలో ఒకరుగా' తన సృజన శక్తిని వెయ్యి రీతుల ఆవిష్కరించుకునే దశ అప్పుడు మొదలవుతుంది. అదే అసలయిన మానవ చరిత్ర. ఆ లోపల ఉన్న మనిషి ఇంకా అవసరాలకూ, అపరిపక్వమైన ఉత్పాదనా శక్తికీ బానిస. ఈ మనిషినే నిర్వచించి, 'మనిషి ఇది, అది' అంటూ సూత్రీకరించడంలో అర్థం లేదు. చేయవలసింది ఈ మనిషి నిజమైన 'మనిషితనాన్ని' సాధించడానికి అవసరమైన ఉత్పాదనా శక్తిని పొందే స్థితికి ఎదిగే చారిత్రిక క్రమంలోని వైరుధ్యాలను విశ్లేషించడం, వాటిని ముందుకు నడిపించడం. తరువాత రాగల దశకూ ప్రస్తుతం మనం బతుకుతున్న 'చరిత్ర పూర్వ' దశకూ మధ్య ఒక అగాధం ఉంది. దానికి ఆవలా ఈవలా ఏ విషయమూ ఒకటి కాదు. అందువల్ల ఈవల నిలబడి ఆవల ఆవిర్భవించబోయే మనిషిని నిర్వచించడం నిరర్థకం.

నిర్వచనం అక్కర లేదని భావించే ఈ ధోరణిలోనూ ఒక నిర్వచనం ఉంది. అసలయిన చరిత్ర మొదలయినాక మనిషి ఎప్పటికప్పుడు తనను వినూత్నంగా నిర్వచించుకోవడం జరుగుతుంది. నిరంతర పునర్నిర్వచనమే అసలైన మనిషి నైజం. అప్పటివరకు జరిగే చరిత్ర పూర్వ దశ అంతా ఆ స్థితికి బీజమైన అనంత ఉత్పాదనా శక్తిని అందుకునే క్రమమే తప్ప వేరే ఏమీ కాదు కాబట్టి, చరిత్రపూర్వదశలో మనిషి ప్రధాన లక్షణం ఉత్పాదనా క్రియ, లేక సృజనాత్మక శ్రమ. అదే ప్రస్తుతానికి మనిషి నైజం. ఆ తరువాత ఒక స్థిరమైన నైజమంటూ లేకపోవడమే మనిషి నైజం.

ఇది ఎందుకయినా పనికొస్తుందేమో గానీ మనం మొదట్లో వేసుకున్న ప్రశ్నకు - సామాజిక అస్తిత్వం సామాజిక చైతన్యాన్ని నిర్ణయించే క్రమం ఎటువంటిది? అనే ప్రశ్నకు - జవాబు చెప్పడానికి మాత్రం పనికి రాదు.

ఎరిక్ ఫ్రామ్ మానవ నైజాన్ని నిర్వచించడం అవసరమని నమ్మిన ఒకే ఒక మార్క్సిస్టు. అయితే దాని అర్థం స్వభావ రీత్యా మనుషులు ప్రాథమికంగా స్వార్థ పరులనో, నిస్వార్థపరులనో, మంచి వాళ్లనో,

చెడ్డ వాళ్లనో ప్రకటించడం కాదు. మానవ అస్తిత్వ నైజాన్ని నిర్వచించడం. ఇతర జంతువుల ప్రవర్తన ప్రధానంగా వాటి జన్యువులలోనే నిర్ణయించబడి ఉంటుంది. మనిషిలో జన్యువులు నిర్ణయించేది కొంచెమే. మనిషి అనివార్యంగా తనచుట్టూ ఉన్న పరిసరాలతో - ఇతర మనుషులతో ప్రయత్న పూర్వకంగా, సంకల్ప పూర్వకంగా వ్యవహరించాలి. ఇది మానవ అస్తిత్వ నైజంలోనే ప్రాథమిక అంశం.

రెండవది ఏమిటంటే తన పరిసరాలతోనూ ఇతర మనుషులతోనూ మనిషి ఏర్పరచుకునే సంబంధాలు స్థూలంగా రెండు రకాలు. మొదటి రకానికి ప్రేమ అనేది సంకేతం. స్నేహం, సహకారం, సానుభూతి, పరస్పరత మొదలయిన గుణాలు ఈ కోవకు చెందినవి. వీటికి ఒక సూచికగా ఫ్రామ్ 'ప్రేమ' అనే మాటను ప్రయోగిస్తాడు. రెండవ రకానికి చెందిన గుణాలకు ఫ్రామ్ పరిభాషలో 'విధ్వంసం' అనే మాట ఒక సూచిక, లేక సంకేతం. ద్వేషం, ఈర్ష్య, ఆధిపత్యం మొదలయినవి ఈ కోవకు చెందిన గుణాలు.

ఈ రెండు రకాలుగా మనుషులు తమ పరిసరాలతో సంబంధాలు నెలకొల్పుకుంటారు. ఇవి రెండూ మానవ సహజమైనవే, ఈ అర్థంలో 'మానవీయమైనవే.' మనం అమానుషం, అమానవీయం అనేవి కూడ పూర్తిగా మానవీయమైన గుణాలే. ఇతర జంతువులు ఆత్మ రక్షణ కోసము, ఆహారం కోసము క్రూరంగా ప్రవర్తిస్తాయి. ఆనందం కోసం క్రూరంగా ప్రవర్తించగల ఏకైక జంతువు మనిషి. ( మన అహంకారం ఎంతటిదంటే దీనిని మనం 'పశుత్వం' అంటాం! )

ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో, ఒక్కొక్క సామాజిక వర్గంలో ఎదిగే పిల్లలు, బతికే పెద్దల వ్యక్తిత్వాలలో ఈ రెండు కోవలకు చెందిన ప్రవర్తనా రీతులు, గుణాలు, విలువలు, ఆలోచనలు ఏ విధంగా నెలకొంటాయన్న విషయాన్ని ఎరిక్ ఫ్రామ్ తన రచనలలో సైకో ఎనాలిసిస్‌కు చెందిన విశ్లేషణా పరికరాల సహాయంతో విపులంగా వివరిస్తాడు. తద్వారా సామాజిక అస్తిత్వం వ్యక్తిత్వాలనూ ఆపైన చైతన్యాన్నీ నిర్ణయించే తీరును వివరిస్తాడు. వర్గమే అంతిమ నిర్ణాయక శక్తి అన్న తన రాజకీయ విశ్వాసాన్ని 'రుజువు చేసేయడం' కోసం అనేక సాధారణ జీవిత పరిస్థితులకు వర్గ ప్రత్యేకతను ఆపాదిస్తున్నాడన్న సందేహం తరచూగా వచ్చినప్పటికీ 'ఆర్థిక పునాది' ని మాత్రం విశ్లేషించి మొత్తం వివరించినట్లు ప్రకటించే సగటు మార్క్సిస్టు సామాజిక విశ్లేషణతో పోలిస్తే ఆయన రచనలు చాలా ఆసక్తికరమైనవి. తన సమ కాలీన యూరోపియన్ సమాజంలో విధ్వంసం అనేదే ప్రధానగుణం కావడం ఫాసిజానికి అనుకూలమైన వ్యక్తిత్వాలను తయారు చేసిందని ఫ్రామ్ చాలా ఆసక్తికరంగా వివరిస్తాడు.

విధ్వంసం ప్రేమలాగ ఎప్పుడూ మానవ ప్రవర్తనా రీతులలో ఉండే గుణమేనని ఒప్పుకుంటూ కూడ, ప్రేమదే పైచేయి అయ్యే సామాజిక పరిస్థితుల రూపకల్పన కోసం కృషి చేద్దాం రమ్మని తన పాఠకులను ఫ్రామ్ ఆహ్వానిస్తాడు. ఇది కేవలం సామాజిక పరిస్థితులకు సంబంధించిన విషయమేనా అన్న సందేహం ఫ్రామ్ రచనల నుండే వస్తుంది. ఆ విషయం అతనే చూడ లేకపోవడం అతని ఆశావాదం ఫలితం. ఏమయితేనేం ఇది మార్క్సిజాన్ని మానవ భూమిక మీద నిలబెట్టే ప్రయత్నమని చెప్పవచ్చు. తన రాజకీయ సిద్ధాంతం 'హ్యూమనిస్ట్ సోషలిజం' అని ఎరిక్ ఫ్రామ్ అంటాడు. అంటే మనిషి అస్తిత్వ నైజాన్నీ దాని పర్యవసానాలనూ వాస్తవికంగా స్వీకరించే సోషలిస్టు ఆదర్శమని అర్థం. ఆ పర్యవసానాలను ఫ్రామ్ విశ్లేషించే పద్ధతిలో అతని ఆశావాదం నుండీ వర్గ నిర్ణాయక సిద్ధాంతం అవశేషాలనుండీ పుట్టిన కప్పదాట్లు అనేకం ఉన్నాయని గుర్తించినప్పటికీ, మనిషిని మనిషిగా స్వీకరించే సోషలిస్టు ఆదర్శాన్ని మించిన రాజకీయ లక్ష్యం వేరే ఉండజాలదని ఒప్పుకోవలసిందే.